శక్తి స్వరూపిణి.. మహిషాసుర మర్దిని


జి.కొండూరు బీసీ కాలనీలో అమ్మవారు



బలివేలో అమ్మవారు


పుట్రేల మారెమ్మ అమ్మవారి అలంకరణ


తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో భద్రకాళిగా..


తిరువూరు గౌరీకేదారేశ్వ రాలయంలో భద్రకాళిగా..


ఊటుకూరు కోదండరా మాలయంలో అలంకారం


కొటికలపూడిలో అమ్మవారు..


ఊటుకూరులో అమ్మవారికి సారె సమర్పణ

జి.కొండూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం అమ్మవార్లు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జి.కొండూరు బీసీ కాలనీలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో కనకదుర్గమ్మ మహిషాసుర మర్దినిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

- **మైలవరం:** మైలవరం కేడీసీసీ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అమ్మవారు మహిషాసురమర్దినిదేవి అలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. సాయంత్రం ఈటుపోటు ఊరేగింపు, ఆంజనేయుస్వామి జెండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు, పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- **నూజివీడు:** పట్టణంలోని కోట మహిషాసురమర్దిని ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దిని అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు జి.సత్యనారాయణచార్యులు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ అలివేణి శ్రీ నాగలక్ష్మీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జంక్షన్ రోడ్డులోని సర్వసతీ ఆలయంలోని సరస్వతీ అమ్మవారు, బస్టాండు వద్ద శివాలయంలో అమ్మవారు, 32వ వార్డులోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గ అమ్మవారు, ఐదో వార్డులోని గంగానమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక రుద్రభూమి వద్ద కనకదుర్గమ్మ వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 800 మందికి అన్నదానం నిర్వహించారు. గురువారం దసరా పండుగను పురస్కరించుకుని కనకదుర్గమ్మ వారి ఆలయ ఆవరణలో 5 వేల మందికి అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.
- **బలివే (ముసునూరు):** బలివేలోని బలేరామలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు, గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, ముసునూరులోని తూర్పు, పడమటి రామాలయాలు, అభయాంజనేయ ఆలయం వద్ద, చెక్కపల్లి, గుడిపాడు, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని శివాలయాల్లో అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద భవానీ దీక్షాదారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా, భద్రకాళిగా అలంకరించారు. తిరువూరు అష్టలక్ష్మీదేవి ఆలయం, గౌరీకేదారేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, షిర్డీసాయి మందిరం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, గంపలగూడెం మండలం ఊటుకూరు, గంపలగూడెం, పెనుగొలను, ఎ.కొండూరు మండలం కంభంపాడు, పోలిశెట్టిపాడు, గోపాలపురం గ్రామాల్లో, తిరువూరు మండలం చౌటపల్లి, రోలుపడి గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి.

కోట మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



మైలవరం: మైలవరం కోట వెనుక వేంచేసి ఉన్న కోట మహాలక్ష్మి అమ్మవారిని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి జోగి రమేష్ బుధవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు జోగి రమేష్‌ను సాదరంగా ఆహ్వానించారు. పూజారులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ నిర్వాహకులు జోగి రమేష్‌కు శాలువతో సత్కరించారు. మైలవరం మండల నాయకులు పామర్తి శ్రీనివాసరావు, ఎన్. దుర్గాప్రసాద్, చామల సీతారెడ్డి, జి.రాము, చంద్రగూడెం సర్పంచ్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారిని రాజ్యలక్ష్మీదేవిగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు.

- **ఇబ్రహీంపట్నం:** ఖిల్లా రోడ్డులోని సత్తెమ్మ అమ్మవారికి భక్తులు, మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు, సారెను మేళతాళాలతో అందజేశారు.

క్లుప్తంగా

మేకా ప్రతాప్ దసరా శుభాకాంక్షలు



నూజివీడు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నియోజకవర్గ ప్రజలకు బుధవారం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అన్ని విషయాల్లో మేలు చేకూరాలని, దసరా పండుగను సుఖ సంతోషాలతో, ఆనందోత్సాహలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

చిరు వ్యాపారులకు రుణ మేళా

తిరువూరు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చిరు వ్యాపారులకు రుణ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా చిరు వ్యాపారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రుణాలను సద్వినియోగం చేసుకుని బ్యాంకుల ద్వారా మరిన్ని రుణాలు పొందాలని ఆయన సూచించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు మురళీకృష్ణ ప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల, కమిషనర్ మనోజ, మెప్మా సీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జి.కొండూరు: జి. కొండూరు గ్రామం చెరువు బజారులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ సర్పంచ్ మండల అరుణతో కలిసి బుధవారం ప్రారంభించారు. రోడ్డు పనులను రూ. 5 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టారు. కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వేములకొండ సాంబశివరావు, కో-ఆప్షన్ సభ్యులు హుస్సేన్, వేములకొండ నవీన్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, నారే ప్రసాద్, బల్ల పంగిడయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై మత్స్యకారులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో తగ్గించిన జీఎస్టీ ధరలపై మత్స్యకార సంఘాలకు అవగాహన సదస్సు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కమర్షియల్ ట్యాక్స్, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మత్స్యశాఖ జిల్లా అధికారి సీఎస్ చక్రాణి మాట్లాడుతూ 99 శాతం వస్తువులపై పన్ను సేవలు తగ్గించారని చెప్పారు. పరోక్ష పన్ను విధానం సేవింగ్‌ను వివరించారు. కార్యక్రమంలో కమర్షియల్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ శకుంతల, మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నూజివీడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్య రంగంలో రక్తం అవసరం ఎప్పుడూ ఉంటుందని, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, శస్త్ర చికిత్సల సమయంలో, వివిధ అనారోగ్య కారణాల వల్ల రోగులకు రక్తం అవసరం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సూపర్‌వైజర్ పురాణం కృష్ణప్రసాద్ 63వ సారి రక్తదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాస్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి తదితరులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్యాల కామేష్, గొల్లు దుర్గాదేవి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఓగిరాల రామలింగేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సర్వసభ్య సమావేశంలో నేతలు పేర్కొన్నారు. ఎంపీడీఓ పి.ఏసుబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

ఆలస్యంగా ప్రారంభమైన సమావేశం

వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రాతినిథ్యం వహిస్తున్న కొన్ని గ్రామాల్లో గత ఏడాది తీర్మానించి, ప్రొసీడింగ్స్ ఇచ్చిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు సభను బాయ్‌కాట్ చేయడానికి నిర్ణయించి, సమావేశ హాలులోకి రాలేదు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఏసుబాబు పలు పర్యాయాలు చర్చలు జరిపారు. ఈ సమస్యపై రాష్ట్ర మంత్రి పార్థసారథితో చర్చించి, వర్క్‌ఆర్డర్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చిన తర్వాత సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. దీంతో సర్వ సభ్యసమావేశం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.

మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి..

జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ మాట్లాడుతూ మామిడి సేద్యం అధికంగా నిర్వహించే మండల రైతులకు చిత్తూరు జిల్లాలో చెల్లించినట్లుగా పంట నష్ట పరిహారం చెల్లించాలని, రూ.923 కోట్లు ప్రజల నుంచి వసూలు చేసిన విద్యుత్ పన్నులు ప్రజలకు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 300 మందికి తల్లికి వందనం నిధులు చెల్లించాలని, చింతలపూడి నుంచి నూజివీడు మీదుగా విజయవాడ నగరానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని, నూజివీడు-ఏలూరు రహదారికి తక్షణం మోక్షం కల్పించాలని కోరారు. గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సైతం అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకుండా ఎన్నికైన ప్రజాప్రతినిధులను చిన్నచూపు చూస్తున్నారని ధ్వజ మెత్తారు. అనంతరం అధికారులు తమ తమ శాఖల పనితీరు, ప్రణాళికలను వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండవ వెంకట్రామయ్యకు ప్రతాప్ అప్పారావు నివాళి

నూజివీడు: నూజివీడు సీడ్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మండవ వెంకట్రామయ్య చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం రాత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. గత నెల 22న వెంకట్రామ య్య మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రతాప్ అప్పారావు పరామర్శించి సంతాపం తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, పాలడుగు విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గోపాల్‌కు సేవారత్న అవార్డు

మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పి. గోపాల్‌కు ప్రజా సేవారత్న అవార్డును సత్తెనపల్లి ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పరంధామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు గోపాల్ సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందజేశామన్నారు. ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోగి రమేష్‌పై విమర్శలు తగదు

ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి జోగి రమేష్‌ను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గోగులమూడి రాణి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కోమటి వెంకటేశ్వరరావును ఇటీవల పోలీసులు అరెస్ట్ చేస్తే జోగి రమేష్ తమ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారని గుర్తు చేశారు. దీనిపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ స్థాయి వారికి లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరావు, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, కుంచం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఆగిరిపల్లి: అడవి నెక్కలంలోని అంబేడ్కర్ కాలనీలో మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ బుధవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఎంపీడీఓ బి.భార్గవి, మండల వ్యవసాయాధికారి జె.భవాని, డెప్యూటీ తహసిల్దార్ జి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెల్లుబోయిన చిట్టిబాబు, ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పదవీ విరమణ చేసి కూడా పేదలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. చిట్టిబాబుతో పాటు రామాంజనేయులను విశ్రాంత ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. సంస్థ ఫౌండర్ కేవీ ఆచారి, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత

ఆగిరిపల్లి: వృద్ధులను గౌరవించడంతో పాటు, ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతవరప్పాడులో ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో పాల్ రమేష్ ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు మేరకు తనవంతుగా వృద్ధులకు సహకారం అందజేస్తున్నానని చెప్పారు.

వృద్ధులకు సన్మానం

తిరువూరు: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ సందర్భంగా తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆవరణలో బుధవారం పలువురు వృద్ధులను సన్మానించారు. సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని, సామాజిక పెన్షను పొందే వృద్ధులకు ఆరోగ్య బీమా, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఐడియాస్ డైరెక్టర్ అవారి శౌరి ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వృద్ధులకు త్వరితగతిన పనులు జరిగేటట్లు ఆదేశాలివ్వాలన్నారు. ఐడియాస్ సంస్థ కార్యదర్శి మేరీ రాణి, మేనేజింగ్ డైరెక్టర్ అవారి అంతయ్య, కో-ఆర్డినేటర్ కొంగల రవిబాబు పాల్గొన్నారు.